క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



జగదీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

బిక్కవోలు: ప్రతిష్టాత్మక సైనిక్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఇల్లపల్లి గ్రామానికి చెందిన తణుకు జగదీష్ ఎంపికయ్యాడని విద్యార్థి తల్లిదండ్రులు తణుకు సత్తిబాబు, తలుపులమ్మ తెలిపారు. గత నెల 5న నిర్వహించిన ప్రవేశ ప్రరీక్షలో తమ కుమారుడు సీటు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థి స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతుండగా, పలువురు అభినందించారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యూనివర్సిటీలో
యోగా సాధన చేస్తున్న బోధనేతర సిబ్బంది

రాజానగరం: యోగా సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యోగాంధ్ర ప్రోగ్రాంలో భాగంగా యూనివర్సిటీ సెమినార్ హాలులో బోధనేతర సిబ్బందికి యోగాసనాలపై అవగాహన కలిగిస్తూ, బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు ఎన్.శివశంకర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన పెంచుకుని నిరంతరం సాధన చేయాలని పెద్దాడ డీసీ చైర్మన్ సానా శ్రీనివాస్ అన్నారు. కరకుదురు వేణుగోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో యోగాసనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. సచివాలయ కార్యదర్శి బి.ప్రసన్నకుమార్, వీఆర్వో భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీ విజయవంతం



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కంబాలచెరువు: డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ డీఎస్సీ విజయవంతమైందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులంతా ప్రణాళికబద్ధంగా చదుకోవాలని అన్నారు. అలాగే రోజూ న్యూస్ చూసి ఎప్పటికప్పుడు జనరల్ నాలెడ్జ్ తయారు చేసుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు మాట్లాడుతూ నగరంలో మూడు కేంద్రాల్లో మోడల్ డీఎస్సీ జరిగిందన్నారు. ఈ పరీక్ష పత్రాన్ని ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తయారు చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, బి.పవన్, బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

సీటీఆర్ఐ: శ్రీపద్మావతి, గోదాదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారి గోవింద క్షేత్రంలో బుధవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. స్థానిక లాలాచెరువు వద్ద ఉన్న గోవింద క్షేత్రంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన నిర్వహించారు. అనంతరం శ్రీసుదర్శన లక్ష్మీ సమేత నారసింహ నిత్య హోమాలు చేశారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, అనంతరం శ్రీవారి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రోగులకు రొట్టెల పంపిణీ

అనపర్తి: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగుర్రెడ్డి పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి పూలమాలలు వేశారు. మండల పరిషత్ ఏఓ ఎం.శ్రీనివాసు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసు, ఏపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు. పెదపూడి మార్కెట్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేశారు.

కోరుకొండ: మండలంలో పలు గ్రామాల్లో జరిగిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాల్లో నాయకులు కంటే కేశవరావు, కంటే గణపతి, మార్ని రాము, మార్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు

- జలుబు, దగ్గు, జ్వరాలతో ప్రజలు
- సర్కారు వైద్యశాలల్లో సౌకర్యాలు మృగ్యం
- ప్రైవేట్ వైద్యానికి పరుగులు



కోటికేశవరం పీహెచ్‌సీలో వైద్య సేవలందిస్తున్న వైద్యురాలు

కోరుకొండ: జలుబా... తలనొప్పా... జ్వరమా... ఇలా ఎవరిని అడిగినా ఏదొక సమస్యతో బాధపడుతున్నామని చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు ముప్పేట దాడి చేయడంతో జనం అల్లాడుతున్నారు. వాతావరణంలో మార్పులతో రోగాలు చుట్టుముడుతున్నాయి. వీరికి సర్కారు వైద్యశాలల్లో సరైన వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కవుతున్నాయి. రాజానగరం నియోజకవర్గంలో వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారే అధిక శాతం ఉన్నారు. ఇందులో చాలామంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. దీనివల్ల అనేక మంది పనులు కోల్పోతున్నారు. పేదల ఆరోగ్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేసినా అక్కడ సరైన వైద్యం అండడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

నియోజకవర్గంలో రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో 72 గ్రామాలు ఉన్నాయి. వీరందరికీ కేవలం 7 పీహెచ్‌సీలు ఉన్నాయి. కోరుకొండ మండలంలో 3, రాజానగరం మండలంలో 2, సీతానగరం మండలంలో 2 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇక్కడ పెరుగుతున్న జనాభా తగ్గట్టుగా వైద్య సేవలు అందడం లేదు. అన్ని మందులు అందుబాటులో లేక ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే చాలా చోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రభుత్వం వైద్యం అంటేనే ఆమడదూరం పారిపోయే రోజులు వచ్చాయి. ప్రతి పీహెచ్‌సీకి రోజూ 50 నుంచి 80 మంది రోగులు వస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. చాలామంది అప్పులు చేసైనా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి



ఉష్ణోగ్రతలు, మారిన వాతావరణం కారణంగా జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో చాలా మంది వస్తున్నాయి. వీరు స్థానిక అందుబాటులో ఉన్న వైద్యశాలలకు చికిత్స పొందాలి. ప్రస్తుతం కాచి చల్లార్చిన నీరు తాగడం ఉత్తమం. త్వరగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి. చల్లని పానియాలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ జ్ఞానచంద్ర, కోరుకొండ

పరిసరాల శుభ్రత అవసరం



గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదైనా తినే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి. బయటి పదార్థాలను తినకుండా ఉంటే మంచిది. ఏదైనా సుస్తి చేస్తే పీహెచ్‌సీల ద్వారా వైద్యం పొందండి.

– కృష్ణవేణి, వైద్యురాలు, కోటికేశవరం పీహెచ్‌సీ

రక్షిత నీరు లేక..



కూటమి ప్రభుత్వం ప్రజలకు రక్షిత నీరు అందించడం లేదు. పేదలు కలుషిత నీటిని తాగడంతో టైఫాయిడ్, జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత రోగాల బారిన పడుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలోనూ విఫలమైంది. వ్యాధులను అరికట్టేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

– నేతుల చిన్ని, ఉప సర్పంచ్, కోరుకొండ

వేసవి విజ్ఞాన తరగతులు



సీతానగరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం చేయించారు. చదవడం మాకిష్టంలో భాగంగా 'కోతి ఎలుగుబంటి' అనే కథను చదివించారు. రిటైర్డ్ హెచ్ఎం బి.భాస్కరరావు ఆధ్వర్యంలో క్విజ్, చదరంగం పోటీలు నిర్వహించారు. విశ్రాంత సహాయ సంక్షేమ అధికారి ఓఎన్ సురేష్‌బాబు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలు వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలకు పెన్నులు, స్కేల్స్ వంటివి అందించారు.

రోడ్డుపై ఇసుక లేకుండా చర్యలు



సీతానగరంలో ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సాక్షి ఇంపాక్ట్

సీతానగరం: రాజమహేంద్రవరం– సీతానగరం రోడ్డుపై ఇసుక లేకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇసుక ర్యాంపుల నిర్వాహకులకు సూచించారు. బుధవారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఇసుక ర్యాంపుల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. 'సాక్షి' దినపత్రికలో 'జారిపడితే ప్రమాదమే' అనే శీర్షికన కథనం వచ్చింది. రోడ్డుపై ఇసుక పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ మృత్యువాత పడుతున్నారు. దీనిపై ఇసుక ర్యాంపు నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. లారీలపై ఇసుక ఎగుమతి సందర్భంలో టార్పాలిన్లు కప్పాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎస్సై డి.రామ్ కుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌లను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న పాల్గొన్నారు.

- స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బలరామకృష్ణ పూలమాలలు వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సేవలపై డాక్టర్ ఏవీకే చైతన్యను అడిగారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్త కావాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ– సెర్ప్ ఆధ్వర్యంలో 'రుణ వార్షిక ప్రణాళిక తయారీ'పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన శిక్షణ పొంది, పరిశ్రమలను స్థాపించడం ద్వారా స్వయం అభివృద్ధితోపాటు పలువురికి ఉపాధి అవకాశాలను కల్పించిన వారవుతారన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మహిళా సంఘాల జీవనోపాధికి అవసరమైన రుణ ప్రణాళికలను తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి రుణాలను విరివిగా పొందేందుకు ముందస్తు వార్షిక రుణ ప్రణాళికలు ఉపయోగపడతాయన్నారు. డీఆర్‌డీఏ జిల్లా మేనేజర్లు ఎ.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాస్‌బాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జి.సునీత, క్లస్టర్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న వెలమ సంఘ సభ్యులు

అనపర్తి: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టి సాగుదామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన్ని అనపర్తి, మండపేట నియోజకవర్గాల శ్రీబ్రహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. పందలపాక గ్రామానికి చెందిన వెలమ సంఘ సభ్యుడు బొడ్డు ముత్యాలరావును వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగ కార్యదర్శిగా నియమించడానికి కేంద్ర కార్యాలయానికి సిఫారసు చేసిన మాజీ ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నిబద్ధత కలిగిన ముత్యాలరావు లాంటి పార్టీ విధేయులకు పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ముత్యాలరావు మాట్లాడుతు పార్టీ తనకు అప్పగించిన గురుతర బాధ్యతను సమర్థంతా నిర్వహిస్తానన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు రొంగల పద్మావతి, రాయవరం ఏఎంసీ మాజీ చైర్మన్ సిరపురపు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ కిలపర్తి సత్యనారాయణ, నాయకులు సత్తి హరిప్రసాదరెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, రొంగల అప్పాజీ, గురు నాగు, వాసిరెడ్డి వాసు, రెడ్డి మహాలక్ష్మీనాయుడు, జామి రామకృష్ణ, గొర్రిపోటి శ్రీనివాస్, బొడ్డు అప్పారావు, గొర్రపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం పలువురిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన కొవ్వూరి రామారెడ్డి, అప్పరాడ నాగేశ్వరరావు, జోగా వినిత్, ధరణికోటకు చెందిన పడాల వీర వెంకట సత్యనారాయణరెడ్డి కుటుంబాలను ఆయన పరామర్శించారు. సర్పంచ్ వారా కుమారి, కొవ్వూరి అశోక్‌రెడ్డి, మల్లిడి వీర్రాఘవరెడ్డి, సునీల్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, వినోద్‌రెడ్డి, తేతల వెంకటరెడ్డి, కప్పరాడ రాజేష్, షణ్ముఖరాజు తదితరులు ఉన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చిన్నప్పటి నుంచే బాలికలు విద్యపై శ్రద్ధ చూపినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి చదువే ఆయుధంగా చేసుకుని.. ఉన్నత విద్యనభ్యసిస్తే భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలు క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. తాము చేస్తున్న వృత్తి పట్ల క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వారికి తప్పక విజయం దక్కుతుందన్నారు. బాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వివాహమైన తర్వాత కూడా విద్యను అభ్యసించవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించి, వస్త్రధారణలో వారికి మంచి సలహాలు ఇవ్వడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. సంప్రదాయ దుస్తులు ధరిస్తే మనకు కలిగే గౌరవ మర్యాదల పట్ల వారికి తెలియజేయాలన్నారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి కె.విజయ కుమారి, రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, జీజీహెచ్ వైద్యురాలు కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీల ఏర్పాటు

తొలగించాలని వైఎస్సార్ సీపీ డిమాండ్



కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పలు కూడళ్లలో నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ ఏర్పాటు చేసిన జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే వాటిని తొలగించాలని వైఎస్సార్ సీపీ నగర మున్సిపల్ విభాగ ఇన్‌చార్జ్ మజ్జి అప్పారావు అన్నారు. దీనిపై మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నగరంలో పలు జంక్షన్లలో టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలు, బ్యానర్లు ఏర్పాటు చేశారన్నారు. మున్సిపల్ అధికారులు వీటిని తొలగించకపోవడం వల్ల తోరణాలు తెగి రోడ్లపై పడి స్కూల్ పిల్లలకు, వాహనాలపై వెళ్లే వారికి చుట్టుకుని ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నిబంధన ప్రకారం ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. టీడీపీ నాయకులు నిబంధనలను తుంగలోకి తొక్కి పర్యావరణానికి విఘాతం కలిగే విధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వీటిని వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. గౌతమీ సూపర్ బజార్ స్థలంలో అక్రమ భవన నిర్మాణాన్ని వెంటనే ఆపాలన్నారు. దీనిపై గతంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ కూడా ఫిర్యాదు చేశారన్నారు. అయినప్పటికీ చట్టవిరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు తనిఖీ చేయకుండా వదిలేస్తే, ఇటువంటి అనధికార నిర్మాణాలు ఇంకా జరుగుతాయని అన్నారు. వెంటనే ఆ నిర్మాణాలు ఆపాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నాయకులు కాటం రజనీకాంత్, ముప్పన శ్రీను, సప్ప ఆదినారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరగాటి దుర్గ, బూత్ కమిటీ అధ్యక్షులు గణేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు రేగుళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

నవయోగమే..



సెంట్రల్ జైల్‌లో యోగా సాధన చేస్తున్న ఖైదీలు

- నగరంలో ఉచితంగా శిక్షణ తరగతులు
- జూన్ 21వ తేదీ వరకూ నిర్వహణ
- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు



ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా నేర్చుకుంటున్న చిన్నారులు

సీటీఆర్ఐ: యోగా... శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసే ఓ ఆయుధం.. ఇది పురాతన భారతీయ తత్వశాస్త్రం.. అలాగే ఆధ్యాత్మిక జ్ఞానోదయానికి మార్గం.. కానీ ఆధునిక కాలంలో యోగా ఎంతో ప్రజాదరణ పొందుతోంది. ఇందులో అనేక రకాలున్నాయి.. కానీ ప్రతిదీ తప్పనిసరిగా శ్వాస అవగాహనతో సాధన చేసే ఆసనాలపై ఆధారపడి ఉంటుంది. యోగాను క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల హృదయ సంబంధ ఫిట్‌నెస్ పెరగడం, కండరాల బలం మెరుగుపడటం, రక్తపోటు సాధారణీకరణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. యోగా ఒత్తిడికి విరుగుడుతో పాటు మెరుగైన నిద్ర విధానాలను ప్రోత్సహిస్తుంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని మార్గదర్శకాలు నివేదించాయి. ఇందుదులో భాగంగా జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరం నగరంలో మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకూ యోగా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. యోగా సాధనలో అందరినీ భాగస్వాములను చేయాలన్నదే దీని ఉద్దేశం.

నగరంలో ప్రతి రోజూ..

నగరంలోని వై.జంక్షన్, ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ చాలా ఆసక్తిగా ఈ యోగాభ్యాసాలు నేర్చుకుంటున్నారు. అధికారులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, వృద్ధులు అనే తేడా లేకుండా యోగాపై ఆసక్తి చూపడం విశేషం. వందలాది మంది ఈ యోగా తరగతుల్లో పాల్గొనడం విశేషం. యోగాలో ప్రాథమిక అభ్యాసం నేర్చుకుంటున్నారు. స్థానిక కేంద్ర కారాగారంలో మంగళవారం యోగాభ్యాస తరగతులు జరిగాయి. ఇందులో 1,300 మంది ఖైదీలు శిక్షణ పొందారు. వీరు అత్యంత సంక్లిష్టమైన వివిధ ఆసనాలను వేయడం విశేషం.

ఒత్తిడి నుంచి విముక్తి



యోగా సాధనతో ఒత్తిడి నుంచి విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులకు ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఆధునిక కాలంలో శారీరక, మానసిక, భావోద్వేగాలను అదుపులో పెట్టడానికి శక్తివంతమైన ప్రక్రియ యోగా. అందుకే నిత్యం సాధన చేయడంతో వ్యాధులనూ దూరం చేయవచ్చు.

– బీవీజీ నాగేంద్రన్, యోగా ట్రైనర్

విపులంగా నేర్పుతూ..



నేను ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులకు హాజరవుతున్నాను. ప్రతిరోజు యోగాలోని పలు ఆసనాలను విపులంగా వివరించడమే కాకుండా వాటిని ఎలా వేయాలో నేర్పుతున్నారు. యోగా శిక్షణ తరగతులు అయ్యాక నేను యోగా నేర్చుకుంటాను.

– టి.సంధ్యన, దొమ్మేటి సీతారత్నం హైస్కూల్

యోగా సాధన అలవాటుగా మారాలి



యోగా చేస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యోగా సాధన నిత్య జీవితంలో ఒక అలవాటు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాంట్ ట్రంక్ రోడ్డు మార్గంలో మూడో రోజు బుధవారం ఉదయం యోగా శిక్షణను మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా యంత్రాంగం, ఆయుష్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా సాధనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. యోగాతో మానసిక, శారీరక స్థితిగతుల్లో ఇబ్బందులు అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేధింపుల నిషేధ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

కంబాలచెరువు: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టంపై ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించేందుకు చేసిన ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి కార్యాలయంలో ఈ విషయాలపై ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. సంస్థలో లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉంటుందన్నారు. ఇబ్బంది ఎదురైన వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు.

పదెకరాల భూమి కేటాయించండి

కడియం: అమరావతిలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా పదెకరాల భూమిని కేటాయించాలని అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ని కలసి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఈ స్థలంలో బొటానికల్ గార్డెన్స్, ఎకో టూరిజం, ప్లాంట్ డైవర్సిటీ కేంద్రం ఏర్పాటు చేసే విధంగా కేటాయించాలన్నారు. పాలకవర్గ సభ్యులు కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జి, గాద నాగేశ్వరరావు, క్రొవ్విడి వాసు తదితరులు పాల్గొన్నారు.